నేటి దినపత్రిక
సూర్య
18వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం | 03 జనవరి 2025 | పేజీలు 8

## చిరమణలో.. మినుము పంట కోత ప్రయోగం



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలం చిరమణ గ్రామంలో షేక్ ఖాజాపీర్ అనే రైతు పొలంలో వేసిన మినుము పంటలో ప్రధాన మంత్రి ఫసలీ బీమా యోజన పథకం కింద 5×5 మీటర్లు చతురస్రంలో పంట కోత ప్రయోగం నిర్వహించారు. గత నెలలో వరసగా వర్షాలు పడుతూ ఉండడం వలన పంట అధికంగా దెబ్బతింది. దీంతో ఈ ప్రయోగం ద్వారా 0.060 కేజీల దిగుబడి వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ప్రయోగం పర్య వేక్షణ అధికారి వై.శోభారాణి, ఉపగనంక అధికారి ఏఎస్ఓ కే.రాజేంద్ర, వీహెచ్ఏ సంధ్యారాణి, రైతులు పాల్గొన్నారు.



# మైనింగ్ మాఫియా ఆగడాలు

## పోలీస్‌స్టేషనే పక్కా సాక్ష్యం !

- బరితెగిస్తున్న మాఫియా..
- అధికారుల కనుసన్నల్లోనే తరలుతోందని ఆరోపణ
- చెలరేగిపోతున్న పుష్పాలు

### అరికట్టేవారే.. లేరా ! అంటూ వాపోతున్న గ్రామ ప్రజలు



కురుసభలో ఆనాడు ద్రౌపతికి జరుగుతున్న అవమానాన్ని కురుపెద్దలు చూస్తు కూర్చునట్లుగా.. సైదాపురం మండల కేంద్రంలో ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని మండలానికి పెద్ద దిక్కు అయిన తహసిల్దారు కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌లు చోద్యం చూస్తూ కూర్చున్నాయి. మైనింగ్ బంగారం తరులుతున్నా.. రోడ్లు ఛిద్రమవుతున్నా.. కళ్ళకు గంతలు కట్టుకొని కూర్చొని పాలన సాగిస్తున్నారు. ఇక ఈ మండల ఎస్ఐ ప్రజా రక్షణ గాలికి వదిలినట్లు కనిపిస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీస్‌స్టేషన్ ముందే విచ్చలవిడిగా రాయి తరలుతున్నా.. మౌనమే వారి పరిపాలనగా సాగుతుంది. ఈ విషయంలో సీఐ బదలీ చర్చనీయాంశం కాగా.. ఎస్ఐ బదలీపై పలు ఊహాగానాలు వచ్చాయి. మళ్లీ ఆయన బదలీపై అయోమయం నెలకొందని ప్రజలు గుసగుసలాడుతున్నారు. చిన్న వాహనదారులకు లైసెన్స్ లేదని, పొల్యూషన్ లేదని అపరాధ రుసుంలతో హడలెత్తిచ్చే పోలీసులు ఈ బడాబాబుల వాహనాలు హల్‌చల్ చేస్తుంటే.. మౌనం వెనుక అర్ధం.. పరమార్ధం చెప్పాలని సైదాపురం ప్రజలతో పాటు, ఈ ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. -- *వివరాలు పరిశీలిస్తే..*

**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండలం రెవెన్యూ కార్యాలయం పైభాగంలో దేవరతిప్ప మీద అత్యంత ఖరీదైన తెల్లరాయి ఖనిజ సంపదను గత పాలకులు కొండను పిండి చేసి తొవ్వేయగా కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక, ప్రస్తుతం ఆ కొండను నిలుపుదల చేయగా.. మళ్లీ యధాతథంగా కొండమీద తవ్వకాలు అక్కడ నుండి ట్రాక్టర్ల ద్వారా యార్డులకు రాయి చేర్చుకుంటూ.. రాత్రులు పగలు తేడా లేకుండా తెల్లరాయిని అక్రమార్కులు తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా.. రెవెన్యూ కార్యాలయం పైభాగంలో చూసీ చూడనట్లు అధికార యంత్రాంగం వ్యవహరిస్తోందంటూ గ్రామ ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.



నిన్నటిదాకా రాత్రి సమయాల్లో తరలిపోతున్న తెల్లరాయి ప్రస్తుతం పట్టపగలు తరలిపోతున్నప్పటికీ తెల్లరాయి పట్టించుకునే వారే లేరు. అధికారుల ఉదాసీనత, అధికార పార్టీ అండదండలు పుష్కలంగా ఉండడంతో అక్రమార్కులు పట్టపగలే బహిరంగంగా బరి తెగిస్తున్నారు. యధేచ్చగా జిల్లాలు, రాష్ట్రాలు దాటి వెళ్తోంది. సైదాపురం మండలంలోని ప్రభుత్వ భూముల్లో కోట్లాది రూపాయల విలువైన తెల్లరాయి అక్రమార్కుల పాలవుతుందని, ప్రభుత్వ ఖజానాకు భారీ గండిపడుతుందని పలువురు గ్రామ ప్రజలు వాపోతున్నా.. కనీసం పరిశీలించిన దాఖలాలు లేవు.

### పట్టపగలే బరి తెగిస్తున్నారు

అక్రమంగా తెల్లారాయి తరలిస్తుండగా మెయిన్ రోడ్డుకు కొద్ది దూరంలో లారీ

-మిగతా 2లో

# చికెనా.. అమ్మో భయం

2లో..

- గతంలో స్టార్ హొటళ్ల దాడుల్లో బయట పడింది
- చోద్యం చూస్తున్న హెల్త్ డిపార్ట్‌మెంట్





**కోవూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా అంటే.. ఆహార ప్రియులకు పెట్టింది పేరు. ముఖ్యంగా ముక్క లేనిదే ముద్దదిగదు.. అయితే ఇక్కడే అలుసై పోయింది. కుళ్ళిన చికెన్ పక్క రాష్ట్రం తమిళనాడు నుంచి లారీల్లో వస్తుందని అందరికి తెలుసు. స్టార్ హొటళ్లకు తక్కువ ధరకు సరఫరా జరుగుతుందని తెలుసు. గతం లో కలెక్టర్ దాడుల్లో హొట ళ్లలో ప్రజా రోగ్యంపై మోస పూరిత వ్యాపార బండారం బయటపడ్డ విషయం అందరికి తెలిసిందే. ఏదైనా చర్యలు మున్నాళ్ళ ముచ్చట మాత్ర మే. ప్రజలంటే అలుసు.. ప్రజారోగ్య భద్రత గాల్లో వదిలేశారు. అమ్యామ్యాలే ముఖ్యం. పక్క రాష్ట్రం నుంచి కుళ్లిన చికెన్ ఇక్కడికి రావాలంటే ఎన్ని చెక్ పోస్టులు.. ఎన్ని టోల్‌గేట్‌లు దాటుకొని రావాలి. అయినా వస్తుందంటే హైవే పక్కనే ఉన్నా, పోలీస్ స్టేషన్‌లు నిఘా ఏమైనట్లు ? చెక్‌పోస్టులు ఏమి చేస్తున్నారు ? ఈ ప్రశ్నలకు జిల్లా ఉన్నతాధికారులే సమాధానం చెబుతూ.. కఠిన చర్యలు చేపట్టాలి.

## నిరుద్యోగులకు సదావకాశం

పట్టణంలోని ఉద్యోగావకాశాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థిని, విద్యార్థులకు, గృహిణులకు నిరుద్యోగులకు ఉపాధి సాధన లక్ష్యంగా నూతనంగా కావలి పట్టణంలోని ముసునూరు మర్రిచెట్టు సమీపంలో "అనంతార్ధ అసోసియేట్స్" ఆద్వర్యంలో షేర్ మార్కెట్లో శిక్షణ ఇవ్వబడును. ఈ శిక్షణ కాలం మూడునెలలు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోండి..

జనవరి 6 నుంచి క్లాసులు ప్రారంభం

క్లాసుల కొరకు సంప్రదించవలసిన నెంబర్
సెల్ : 8686513242



## కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు

# పర్యవేక్షించిన ఎస్పీ కృష్ణకాంత్





**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** జిల్లాలోని పోలీస్ కవాతు మైదానంలో జరుగుతున్న కానిస్టేబుల్ రిక్రూట్మెంట్ ఎంపికలో భాగంగా నిర్వహించిన దేహదారు ఢ్య పరీక్షలను జిల్లా ఎస్పీ జి కృష్ణ కాంత్ పర్యవేక్షించారు. లాంగ్‌జంప్, హైజంప్ లను స్వయంగా పరిశీలించారు. మూడవరోజు కొనసాగిన దేహదారుఢ్యా పరీక్షలకు 328 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో అడిష నల్ ఎస్పీ సౌజన్య, డీఎస్పీలు శ్రీనివాసులు రెడ్డి, ఘట్టమనేని శ్రీనివాసరావు, చెంచు రామా రావు, స్పెషల్ బ్రాంచ్ సిఐ శ్రీనివాసులు రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## చికెనా.. అమ్మో భయం !



**కోవూరు, మేజర్‌న్యూస్ :** కోవూరు మండలం ఇనమడుగు పంచాయతీ జమ్మిపాలెం పరిసర ప్రాంతాల్లో కొందరు వ్యక్తులు రాత్రి 12 గంటల తర్వాత చికెన్ వ్యర్థాలను రహస్యంగా చెన్నై, బెంగళూరు నుంచి అక్రమంగా తీసుకుని వచ్చి రాత్రులు రహస్యంగా గుంటల్లో చేపలకు మేత వేయడం జరుగుతుంది. దీనిపై గతంలో పలుమార్లు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి నియోజకవర్గంలో చికెన్ వ్యర్థాలు వేసేందుకు వీలులేదని ఖరాఖండిగా చెప్పారు. పలుమార్లు చికెన్ వేస్ట్ వాహనాలను అధికారులు సీజ్ చేయడం కూడా జరిగింది. అయినా చికెన్ మాఫియా మేమంతే అన్నట్లుగా.. వారి తీరు ఏమాత్రం మారలేదనట్లుగా ఉంది. అధికారులు చూసీ చూడనట్లు వదిలేయకుండా.. చికెన్ వేస్ట్ మాఫియాపై నిఘా ఉంచి కోవూరు నియోజకవర్గంలోకి ఎమ్మెల్యే చెప్పినట్లుగా చికెన్ వేస్ట్‌ని రానివ్వకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌లకు ప్రధానోపాధ్యాయులకు శిక్షణ



**చేజర్ల, మేజర్‌న్యూస్ :** చేజర్ల మండలంలోని అన్ని పాఠశాలల ఎస్ఎంసీ చైర్మన్‌లకు ప్రధానోపాధ్యాయులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని గురు వారం చేజర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు నిర్వహించారు. ఈ మండలస్థాయి శిక్షణలో పాఠశాల యాజమాన్య కమిటీ విధులు, బాధ్యత లు, బాలల హక్కులు, పాఠశాలల అభివృద్ధి ప్రజల భాగస్వామ్యం మొదలై న అంశాలపై డిస్ట్రిక్ రీసోర్స్ పర్సన్స్ శిక్షణ ఇవ్వడం జరిగిందని, ఇక్కడ శిక్షణ తీసుకున్నవారు 4వ తేదీ పాఠశాల స్థాయిలో ఎస్ఎంసీ సభ్యులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని మండల విద్యాశాఖాధికారి-2 డీసీ మస్తా నయ్య తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు హైమావతి, డీఆర్‌పీలు సుబ్రహ్మణ్యం, రమణయ్య, ప్రధానో పాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్లు పాల్గొన్నారు.

# సచివాలయ విధుల్లో మెరుగైన పనితీరును కనబరచండి

### కమిషనర్ సూర్యతేజ

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని సచివాలయాల్లో విధుల నిర్వహణలో పౌర సేవలకు సంబంధించి మెరుగైన పనితీరును కార్యదర్శులు ప్రదర్శించాలని కమిషనర్ సూర్య తేజ ఆదేశించారు. స్థానిక 12/1 మేకల వారి తోట, 2/2 నేతాజీ నగర్ సచివాలయాలను కమిషనర్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శులతో కమిషనర్ మాట్లాడుతూ సచివాలయాల పరిధిలోని టిడ్కో గృహ లబ్ధిదారులను గృహ ప్రవేశాలు జరిపేలా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. టిడ్కో నిర్వాహకులకు అన్ని ప్రాంతాల్లోని గృహాలకు విద్యుత్ సౌకర్యం కల్పించేలా ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. టిడ్కో గృహ సముదా యాలకు ప్రత్యేకంగా సచివాలయాలను కేటాయించి అక్కడి ప్రజలకు సంబంధించిన అన్ని పౌరసేవల కార్యక్రమాలను పూర్తిచేసేలా చర్యలు తీసు కుంటున్నామని తెలిపారు. విధుల నిర్వహణపై ప్రతిరోజు సచివాలయంలోని



అన్ని విభాగాల కార్యదర్శులు ముందస్తుగా ప్రతిరోజూ సమావేశం ఏర్పాటు చేసుకొని కార్యనిర్వహణలో కార్యదర్శులు అందరూ సమన్వయంతో పాల్గొ నాలని కమిషనర్ ఆదేశించారు. 12/1 సచివాలయ శానిటేషన్ కార్యదర్శి విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందున షోకాజ్ నోటీసు జారీ చేయమని కమిషనర్ ఆదేశించారు.

# మైనింగ్ మాఫియా ఆగడాలు.. పోలీస్‌స్టేషనే పక్కా సాక్ష్యం !

*(మొదటి పేజీ తరువాయి)*

దిగబడిపోయింది. ఎంతకీ బయటికి రాకపోవడంతో అక్రమార్కుల గుండెల్లో దడ మొదలైంది. ఆలస్యం చేస్తే తమ దొంగతనం బయట పడుతుందనే భయంతో హుటాహుటిన జేసీబీని పిలిపిం చారు. జేసీబీ సాయంతో లారీని రోడ్డు మీదకు చేర్చి అక్కడి నుంచి తరలించారు. నెల్లూరు జిల్లా సైదాపురం మండలం సైదాపురం ప్రభుత్వ ఆసుపత్రి పైభాగంలో ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి పైభాగం నుంచి కొంత కాలంగా తెల్లరాయి అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే ఈ తతంగం నడుస్తుందని, ఇప్పటికే అధికారులకు అనేక ఫిర్యాదులు అందాయి. అయినా అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంత బహిరంగంగా తెల్లరాయి అక్రమ రవా ణా జరుగుతున్నా అధికా రులు పట్టించుకోకపో వడంపై సర్వత్రా విమ ర్శలు వినిపిస్తున్నాయి. తమ గ్రామాల సమీపం లోని ప్రభుత్వ భూముల్లో జరుగుతున్న అక్రమా లను రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులకు తెలియజేసినా.. స్పందన కరువైందని ప్రజలు మండిపడుతున్నారు.

### కూతవేటు దూరంలో తహసిల్దార్ కార్యాలయం

ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన సొమ్మును అడ్డగోలుగా దోపిడి జరుగుతు న్నప్పటికీ ప్రభుత్వ అధికారులు పట్టీపట్ట నట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దేవరతిప్ప మీద ట్రాక్టర్లు, లారీలు తెల్లరాయి లోడింగ్ చేసుకుంటున్నప్పుడు రెవెన్యూ, పోలీసులకు సమాచారం ఇచ్చినప్పటికీ అధికారులు తూతూమంత్రంగా పని చేస్తున్నారన్న విమర్శలున్నాయి. లోడు ఎత్తుకున్న లారీలు పోలీస్ స్టేషన్ ముందే తరలిపోవడాన్ని గుర్తించి న ప్రజలు.. ఇది అధికా రులకు తెలిసే పోతుందా ! అని మండిపడుతు న్నారు. ప్రభుత్వ ఖజానా కు రావాల్సిన సొమ్మును మాఫియాదారులు అడ్డ గోలుగా దోచుకుంటు న్నారు. అయితే పోలీస్ యంత్రాంగం మాత్రం ఒక బండిని కూడా పట్టు కున్న దాఖలు లేవని మండల ప్రజలు విస్మరించుకుంటున్నారు.

### మైనింగ్ డిపార్ట్‌మెంట్ పాత్ర :

మైనింగ్ డిపార్ట్‌మెంట్ సైదా పురం మండలంలో గత ప్రభుత్వంలో రాయి యాడ్లు పర్మిషన్లు ఉన్నప్పటికీ



కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వాటిని తాత్కాలికంగా నిలిపి వేసి ఏ యాడ్లో ఎంత స్టాక్ ఉందో గుర్తించి, వాటికి పర్మిషన్ ఇచ్చేవరకు ఎత్తకూడదని యార్డ్ యజమానులకు తెలియజేశారు. అయితే మైనింగ్ అధికారుల అనుమతులు లేకుండా మాఫియాదారులు ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాల్లోనూ.. పొలాల్లోనూ విచ్చలవిడిగా మాఫియా గ్యాంగ్ రాయి యాడ్లుగా ఏర్పాటు చేసుకొని డంపింగ్ చేసి ఉన్న ఖనిజ సంపదను రాత్రి పగలు తేడా లేకుండా మాఫియాదారులు లారీలకు లోడులు చేయించుకుని తరలిస్తూ ఉండడం గమనార్హం.

# వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు సమన్వయ సమావేశం

**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి వారి దేవస్థానంలో గురువారం సాయంత్రం 4.00 గం.లకు దేవస్థానం నందు జనవరి 10న జరుగు ముక్కోటి వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు గురించి అనుషా, రెవెన్యు డివిజినల్ అధికారి చే సమన్వయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంకు నెల్లూరు నగర పాలక సంస్థ వారు, ఫైర్ డిపార్టుమెంట్, హెల్త్ డిపార్ట్మెంట్, సంతపేట స్టేషన్ హౌస్ ఆఫీసరు వారు, మెడికల్ డిపార్టుమెంటు, విద్యుత్ శాఖ, రెవెన్యు డిపార్ట్ మెంట్ కె.జనార్ధన రెడ్డి, జిల్లా దేవాదాయ శాఖ అధికారి, నెల్లూరు దేవాదాయ శాఖ, దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆళ్ళ శ్రీనివాస రెడ్డి, దేవస్థాన చైర్మెన్ మంచికంటి శ్రీనివాసులు ధర్మకర్తల మండలి సభ్యులు వేలూరు శ్రీనివాసులు, వీరెపల్లి పద్మజ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నందు రెవెన్యు డివిజినల్ అధికారి వారు వివిధ శాఖల అధికారులతో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు పై సమీక్షించి చేయవలసిన పనులు గురించి ఆదేశించారు.



- విద్యుత్ శాఖ వారికి డిసెంబర్ 31 2024 నుండి 19 జనవరి 2025 వరకు కరెంటు అంతరాయం లేకుండా ఏర్పాటు చేయవలసినదిగా సూచించడమైనది.
- ఆరోగ్య శాఖ వారు జనవరి 9, 10 రాత్రి పది గంటల వరకు మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయవలసిందిగా ఆదేశించడం అయినది.
- పోలీసు శాఖ వారు జనవరి 9 సాయంత్రం ఆరు గంటల నుండి జనవరి 10 రాత్రి పది గంటల వరకు బందోబస్తు ఇవ్వగలరని ట్రాఫిక్ నియంత్రణ, బ్రిడ్జిపై వాహన రాకపోకలు నిలిపి వేయాలి అని తెలపడమైనది.
- నగరపాలక సంస్థ వారు మంచినీటి వసతి, దేవస్థాన పరిసరాలు శుభ్రపరచుట, బ్లీచింగ్ చల్లుట, దేవస్థానం వెనుక భాగంలో తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయుట, జనవరి 9 ఉదయం నుండి జనవరి 10 రాత్రి వరకు అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి సానిటేషన్ ఏర్పాటు చేయుట, ఫ్లడ్ లైట్లు జనవరి 10వ తేదీ నుండి 19వ తేదీ వరకు ఏర్పాట్లు చేయాలని సూచించడమైనది.
- ఫైర్ సర్వీసు వారు గజ ఈతగాళ్ళు ఇద్దరినీ జనవరి 9 సాయంత్రం నుండి జనవరి 10 రాత్రి వరకు దేవస్థానం స్నాన ఘాట్ వద్ద ఏర్పాటు చేయాలి అని తెలిపారు.
- దేవస్థానము వారు క్యూ లైన్‌లో ఏర్పాటు చేసి దేవస్థానంలో విద్యుత్ అలంకరణ, దేవస్థానం నందు శానిటేషన్ ఏర్పాటు, సిబ్బంది ఏర్పాట్లు వివిధ దేవస్థానముల నుండి సిబ్బంది ఏర్పాటు దేవస్థాన ఆవరణలో మంచి నీరు ఏర్పాట్లు భక్తులకు ఉచిత ప్రసాదం ఏర్పాట్లు గురించి సూచించడమైనది.
- దర్శనమునకు వచ్చు భక్తులకు టికెట్ల ధర వివరములు ఈ విధముగా ఉండునని తెలియజేశారు ప్రత్యేక దర్శనం 50 రూపాయలు వైకుంఠ ఏకాదశి ప్రత్యేక దర్శనం 200 రూపాయలు ఒకరికి. దర్శనం ఉదయం 4:30 నుండి రాత్రి 10 గంటల వరకు ఉండునని తెలిపారు.

# హైందవ శంఖారావం సభకు తరలిరండి

### - బీజేపీ నేత చిలకా ప్రవీణ్ కుమార్



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో దేవాలయాలపై రాజకీయ పెత్తందాల నుంచి విముక్తి పొందేందుకు, స్వయం ప్రతిపత్తి సాధన కోసం విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5, 2025న విజయవాడ, కృష్ణాజిల్లా, గన్నవరం మండలం, కేసరపల్లె వద్ద, హైందవ శంఖారావం పేరుతో భారీ బహిరంగ సభ జరగనుందనీ బీజేపీ జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్ కుమార్ అన్నారు. దేవాలయాల్లో రాజకీయ జోక్యాలు మితిమీరిపోతున్నాయని, హిందూ సమాజానికి దేవాలయాలను స్వయంగా నిర్వహించగల సామర్థ్యం ఉందని తెలిపారు. దేవాలయాలు రాజకీయ నిరుద్యోగుల కోసం కాక, హిందూ ధర్మ పరిరక్షణకు నిలయాలుగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రస్తుత కాలంలో దేవాలయాల రక్షణ ఇబ్బందికరంగా మారిందని, హిందువుల అనైక్యత, ఉదాసీనత వల్ల కొందరు ఇతర మతాల వ్యక్తులు హిందుత్వం పై విషం కక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేవాలయాలపై ప్రభుత్వ ఆధిపత్యం వల్ల, అలాగే ఆలయాల్లో ఇతర మతాలకు చెందిన వ్యక్తులు పనిచేయడం వల్ల ఆలయాల గౌరవానికి నష్టం కలుగుతోందని తెలిపారు. లక్షలాది హిందువులు ఈ హైందవ శంఖారావం సభకు తరలి వచ్చి, హిందూ ధర్మ పరిరక్షణకు మద్దతు తెలపాలని ఆయన పిలుపునిచ్చారు.

# వరి సాగుకు ఈ క్రాపింగ్ తప్పనిసరి



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** రబీసీజన్ నందు వరిసాగు చేస్తున్న ప్రతి రైతు తప్పనిసరిగా ఈ క్రాపింగ్ చేయించాలని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు రైతులకు సూచించారు. గురువారం పొట్టెంపాడు గ్రామపంచాయతీలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ నిర్వహించగా రైతులు అధికారులు హాజరయ్యారు. ఉన్నతాధికారులు రాజ్ కుమార్ ఈ కార్యక్రమం గురించి తెలియజేశారు. నానో యూరియా పాటు నానో డిఏపి వరికి వినియోగించడం వల్ల ఖర్చు తగ్గుతుంది అన్నారు. ఈ విషయాన్ని రైతులు తెలుకుసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఆఫీసర్ జోత్స్న రాణి, అధికార పార్టీ నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలి సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతా

### మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య వెల్లడి



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్యని కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది అఖిలభారత పద్మశాలి సంఘం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మాజీ అధ్యక్షులు అవార్ రామచంద్రయ్య అఖిలభారత పద్మశాలి సంఘం నెల్లూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సోమ గోపాల్ సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ అఖిలభారత చేనేత విభాగం జాతీయ అధ్యక్షులు బూదాటి రాదయ్య మాట్లాడుతూ.. జిల్లాలో ఉండే చేనేత సమస్యల మీద త్వరలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ని పద్మశాలి సంఘం రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్యని, టీటీడీ బోర్డు మెంబర్ తమ్మిశెట్టి జానకిని కలిసి సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. అలాగే జిల్లాలో ఉండే చేనేతలందరికీ నూతన సంవత్సర సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

# రెండు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలంలో బుధవారం రెండు గ్రామాల్లో రెవిన్యూ సదస్సులు నిర్వహించడం జరిగింది. మండల పరిధిలోని తిక్కవరం, ఇర్లపాడు గ్రామాల్లో ఈ సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు రైతుల వద్ద నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. వచ్చినటువంటి అర్జీలను ఆన్లైన్ లో పొందుపరిచి తగు రసీదులను అందజేశారు. త్వరలోనే ఈ సమస్యలను పరిష్కరిస్తామని వారికి తెలియజేశారు. భూ సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసిల్దార్ అనిల్ కుమార్ తో పాటు రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కోటపాడు రోడ్డును పరిశీలించిన అధికారులు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలంలో అనాదిగా రహదారి అధ్వాన్నంగా ఉంటూ జనాలు, ప్రధానంగా విద్యార్థులు ఇబ్బందిపడుతున్న కోటపాడు రోడ్డును గురువారం పంచాయతీరాజ్ అధికారులు పరిశీలించారు. ఆత్మకూరు-నాగులపాడు రోడ్డు నుండి మహిమలూరు మజరా కోటపాడు గ్రామానికి 2కిలోమీటర్ల గ్రావెల్‌రోడ్డు ఉండగా నాలుగు చినుకులు పడినా అడుగుపెట్టలేని విధంగా బురదమయమవుతుంటుంది. ఆగ్రామం నుండి ప్రతినిత్యం దాదాపు 20మంది విద్యార్థులు మహిమలూరు, ఆత్మకూరు పాఠశాలల్లో విద్యాభ్యాసానికి వెళుతుంటారు. ఆ బురదలో అడుగుపెట్టలేని పరిస్థితిని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్ళారు. అనేకదపాలు ధర్నాలు చేశారు. జిల్లా కలెక్టర్ ఆత్మకూరుకు విచ్చేసిన సందర్భంగా అక్కడ కూడా విద్యార్థులు, గ్రామస్థులు ధర్నా చేసి సమస్య తీవ్రతను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. ఆయన స్పందించి 75లక్షల రూపాయల



నిధులు మంజూరుకు హామీ ఇచ్చారు. అయితే నిధులు మంజూరుచేసినా బిల్లులు అవుతాయోలేదో అన్న సందేహంతో ఈరోడ్డు పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రానందున సమస్య అలాగే ఉంది. ఇటీవల ఈ సమస్యను రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్ళగా ఆయన వెంటనే స్పందించి అధికారులు వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దాంతో గురువారం పంచాయతీరాజ్ అధికారులు ఈరోడ్డును పరిశీలించి కొలతలు కూడా వేసి త్వరలో పనులు ప్రారంబించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామస్థులు, విద్యార్థులు మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# మున్సిపల్ సిబ్బందితో సమీక్ష సమావేశం




**కావలి, మేజర్‌న్యూస్ :** పట్టణంలో నూతన సంవత్సరంలో మున్సిపల్ సిబ్బంది ద్వారా చేపట్టబోయే కార్యక్రమాల మీద కావలి మున్సిపల్ సిబ్బందితో గురువారం మున్సిపల్ కమిషనర్ ఛాంబర్ కార్యాలయంలో కమిషనర్ శ్రావణ్ కుమార్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొట్టమొదటిగా కావలి మున్సిపాలిటీ తరఫున ఒక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కావలి పట్టణంలో కొన్ని ప్రాంతాలలో చెత్త విస్తృతంగా పడవేస్తూ గృహాల దగ్గర పరిశుభ్రంగా ఉండవలసిన ప్రదేశములు వ్యర్థాలను వేస్తున్నారు. ఆ ప్రదేశాన్ని సుందరంగా తీర్చిదిద్ది అక్కడ తులసి చెట్లను నాటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని తలపించే విధంగా చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. అలాగే నూతన సంవత్సరంలో కావలి నియోజకవర్గం ఏ విధంగా చెత్త రహిత ప్రాంతముగా స్వచ్ఛభారత్‌లో భాగంగా కావలి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ఒక ప్రణాళికను రూపొందిస్తున్నట్లు, ఈ ప్రణాళికలో ముఖ్యమైన అంశాలు చర్చిస్తున్నట్లు తెలిపారు. అలాగే కావలి పట్టణంలో పారిశుధ్యం పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పారిశుధ్య కార్మికులకు ఏ విధంగా చేస్తే కావలి పట్టణం క్లీన్ అండ్ గ్రీన్ గాచేయాలి, అలాగే డ్రైనేజ్ వ్యవస్థ త్రాగునీటిపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. అలాగే కావలి ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కావలి పట్టణ అని సుందరంగా తీర్చిదిద్దేందుకు నూతన సంవత్సరంలో కావలి పట్టణ ప్రజలు మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

# రైతులు తగు అవగాహనతో పంటసాగుచేయాలి

## మండల వ్యవసాయాధికారి కిషోర్



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రైతులు పంటల సాగు, యాజమాన్యంలో తగు మెళుకువలు పాటించాలని, తగిన అవగాహనతో వ్యవహరించాలని ఆత్మకూరు మండల వ్యవసాయాధికారి కె.కిషోర్ పేర్కొన్నారు. సాగునీటి లభ్యత, వనరులనుబట్టి పంటలు సాగుచేయాలని, అవసరానికనుగుణంగా ఎరువులు, సస్యరక్షణ మందులు వినియోగించాలని ఆయన పేర్కొన్నారు. ఆత్మకూరు మండలంలో రైతులకు అవగాహన కల్పించేలా పొలంబడి కార్యక్రమాలు మండలంలోని అన్ని రైతుసేవాకేంద్రాల పరిధిలో నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. కౌలురైతులకు పంటసాగు దారుల హక్కుపత్రం (సిసిఆర్‌ఏ)ల గురించి, వాటిని పొందడం, ప్రయోజనాలు గురించి అవగాహన కల్పించామని ఆయన వెల్లడించారు. మండలంలో సుమారు 800మంది కౌలు రైతులుంటారని, గత ఏడాది సిసిఆర్‌ఏ సర్టిఫికేట్లు ఇచ్చామని, మళ్ళీ రెన్యువల్, నూతనంగా పొందడం గురించి అవగాహన కల్పించామన్నారు. కౌలురైతులకు కార్డులుంటే ప్రభుత్వం నుండి లభించే విత్తనాలు, సబ్సిడీలు తదితర ప్రయోజనాలు ఉంటాయని కిషోర్ తెలిపారు. పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు ఇప్పటివరకు మండలంలో 98.4క్వింటాళ్ళ జీలుగలు, 33.76క్వింటాళ్ళ పిల్లిపెసలు, 11.7క్వింటాళ్ళ జనుములు పంపిణీ చేశామని, ఇంకా అవసరమైనవారికి విత్తనాలు త్వరలో వస్తాయని కిషోర్ పేర్కొన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో సాగునీటి లభ్యతనుబట్టి వరినాట్లును రైతులు వేశారని, కనుపూరుపల్లి, కరటంపాడు, అప్పారావుపాళెం, బండారుపల్లి తదితర గ్రామాల్లో సాగు చేశారని, ఆత్మకూరు మండలంలో సాగునీరు సమకూరడంతో రబీలోనే అధికంగా పంటలు సాగుచేశారని వ్యవసాయాధికారి వివరించారు. మండలంలో తమ ఆధ్వర్యంలో ఒక ఏయివో, ఇద్దరు ఎంపియివోలు, అన్ని ఆర్‌ఎస్‌కెలలో ఒక్కో వివిఏలు ఉంటారని, రైతులకు అవసరమైన సేవలను అందుబాటులో ఉంటూ అందిస్తున్నామని వ్యవసాయాధికారి కిషోర్ పేర్కొన్నారు.

## ఎంపీడీఓని కలిసిన ఏపీటీఎఫ్ నాయకులు




**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ముత్తుకూరు ఎంపీడీవో నాగమణిని గురువారం ఏపీటీఎఫ్ కార్యవర్గం మర్యాదపూర్వకంగా కలిసింది. మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి ఏపీటీఎఫ్ నాయకులు వెళ్ళి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏపీపీఎఫ్ కు ఎంపీడీవో ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సిహెచ్ వి.కృష్ణారెడ్డి, జనార్ధన్, ఎన్‌వి కృష్ణయ్య, శీనయ్య, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నారికేళ్ళపల్లిలో రెవెన్యూ సదస్సు




**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** నారికేల్లపల్లి గ్రామపంచాయతీలో గురువారం రెవిన్యూ సదస్సు జరిగింది. భూముల సమస్యలపై జరిగిన ఈ కార్యక్రమానికి రైతులు హాజరు కావడం జరిగింది. సర్వే డిప్యూటీ తాసిల్దార్ శ్రీనివాసులు రైతుల నుండి అర్జీలు తీసుకున్నారు. భూముల సమస్యలు పరిష్కరించాలంటూ వివిధ కోణాల్లో 18 అర్జీలు రైతులు అధికారులకు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన అర్జీలకు అధికారులు సమాధానం తెలియజేసి పరిష్కరించే సమయాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## చేజర్లలో పొలం పిలుస్తుంది




**చేజర్ల, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన చేజర్లలోని పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా వరి రకం కేఎన్‌ఎం-1638 నాటిన 30 రోజులకే ఎన్ను తీస్తున్నాయని తెలిపిన రైతుల పొలాలను మండల వ్యవసాయ అధికారి శశిధర్ పరిశీలించారు. కేఎన్‌ఎం-15048 రకాలు నవంబర్ 15 నుండి డిసెంబర్ 15 తేదీ లోపల నారు పోసుకొని 25 రోజుల నారును నాటుకోవాలని తెలియజేశారు. అలాగే ముందుగా నారుపోసిన వరిలో ఈ విధంగా ముందుగా ఎన్ను రావడం జరిగింది. ఈ రకాలకు ఎండ ఎక్కువగా అవసరం అని అంతేకాకుండా ఈమధ్య వాతావరణం వానలు వస్తూ మబ్బులు పట్టి ఉండటంలో ఈ విధంగా వచ్చిందని తెలిపారు. దీనికి ఎకరాకు ఒక బస్తా యూరియాను బురదపదునులో చల్లాలి తరువాత వారం రోజులకు ఒక బస్తా యూరియా అరబస్త పోటాష్ చెల్లితే పక్కన కొత్త పిలకలు వచ్చి సమానంగా ఎన్నులు వస్తాయని ఏవో శశిధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## భగత్ సింగ్ కాలనీలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ ఆదేశాల మేరకు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య స్థానిక 54 వ డివిజన్ భగత్ సింగ్ కాలనీలోని వివిధ ప్రాంతాలు, వెంకటేశ్వరపురం టిడ్కో గృహ సముదాయాల ప్రాంగణాలను స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించి గురువారం శుభ్రం చేశారు. అలాగే ఇంటింటి చెత్త సేకరణ, డ్రైను కాలువల్లో పూడికతీత, సిల్ట్ ఎత్తివేత, దోమల మందు పిచికారి, జంగల్ క్లియరెన్స్ తదితర పనులను డాక్టర్ ప్రత్యక్షంగా పర్యవేక్షించారు.

## కావలి ఎమ్మెల్యేని కలిసిన మాజీ ఎమ్మెల్యే



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో గురువారం స్థానిక ముసునూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిని మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్ రెడ్డి కలిసి దుశ్యాలువతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కావలి నియోజకవర్గం పరిస్థితులపై చర్చించుకున్నారు.

## రూరల్ కార్యకర్తలకు పదవుల కేటాయించండి




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్‌లో పనిచేస్తున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు రాష్ట్ర స్థాయిలో కొన్ని పదవులు కేటాయించాలని నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డితో నెల్లూరు రూరల్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొండ్రెడ్డి రంగారెడ్డి గురువారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పలు కీలకమైన నిర్ణయాలు తీసుకున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న ముఖ్యమైన వైఎస్ఆర్ పార్టీ కాంగ్రెస్ నాయకులకు జిల్లా, రాష్ట్రస్థాయిలో పార్టీ పదవులను అప్పగించాలని కోరారు. రూరల్‌లో వైయస్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ముఖ్యమైన కార్యకర్తల పేర్లను కాకాణి దృష్టికి తీసుకుని వెళ్లారు. దీంతో ఆయన సుముఖం వ్యక్తం చేశారు.

## ఎస్‌ఎంసి కమిటీ చైర్మన్‌లకు శిక్షణ కార్యక్రమాలు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం ముత్తుకూరు మండల కేంద్రం జడ్పీ హైస్కూల్ నందు స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించింది. ఆయా పాఠశాలల చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు విచ్చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎంసి కమిటీ చైర్మన్‌లకు వారి విధులు గురించి వివరణాత్మకంగా విద్యాశాఖ తెలియజేసింది. పాఠశాలలో విద్యాబోధన, విద్యార్థులు క్రమశిక్షణ, గ్రామస్తుల సహకారంతోపాటు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాల గురించి చైర్మన్లు సహకారం అందించాలని విద్యాశాఖ తెలియజేసింది. కార్యక్రమంలో ఎంఈఓ మధుసూదన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కమిటీ చైర్మన్‌లకు, హెచ్‌ఎంలకు శిక్షణ తరగతులు



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు మండల కేంద్రమైన ఏఎస్ పేటలోని మోడల్ హైస్కూల్లో మండల స్థాయి పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌లకు పాఠశాల ప్రధానోపాధ్యాయులకు బుధవారం ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రతి పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్స్‌గా ఉపాధ్యాయుల నుండి ఎం.హరిప్రసాద్ బి.గణపతి సిహెచ్ రాజా రామిరెడ్డి కమిటీ సభ్యుల నుండి ఆర్.లోకేశ్వరి వ్యవహరించారు. అలాగే శిక్షణ తీసుకున్న సభ్యులు ఉపాధ్యాయులు ఈనెల 6వ తేదీ లోపు తమ పాఠశాల యందలి మిగిలిన యాజమాన్య కమిటీ సభ్యులకు ఉపాధ్యాయులకు 6వ తేదీ లోపు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని మండల విద్యాశాఖ అధికారులు ఎం.జ్యోతి, డి.సాయి ప్రసాద్ తెలియజేశారు. శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈఓలు పర్యవేక్షించారు. పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యుల విధులు బాధ్యతలు గురించి వివరించారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని పాఠశాలల హెచ్ఎం పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌లు పాల్గొన్నారు.

# చెరువులో వృక్షసంపదను నిర్లక్ష్యం చేయడం తగునా : రైతుసంఘం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు చెరువులో అటవీశాఖ ఆధ్వర్యంలో పెంచిన నల్లతుమ్మ వృక్ష సంపదను సంబంధిత అధికారులు అత్యంత నిర్లక్ష్యం వహించారని, రాబడిని వృధా చేశారని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ప్రధానకార్యదర్శి లక్కు కృష్ణప్రసాద్ విమర్శించారు. ఆయన జిల్లా కౌలు రైతుసంఘం నాయకుడు గంటా లక్ష్మీపతి, మండల రైతుసంఘం అధ్యక్షుడు కృష్ణప్రసాద్‌లతో కలిసి ఆత్మకూరు చెరువును పరిశీలించారు. గతంలో అటవీశాఖవారు చెరువులోతట్టు తుమ్మల మొక్కలు వేయడం, అవిపెరిగి పెద్దయినా వాటిని గురించి పట్టించుకోనందున ఎండిపోవడం తోపాటు మట్టిగా మారుతున్న పరిస్థితిని వారు పరిశీలించారు. గతంలో చెరువుల్లో సామాజిక అటవీశాఖ ఆధ్వర్యంలో తుమ్మమొక్కలు నాటితే అవి పెరిగిపెద్దవయ్యాక వేలంద్వారా విక్రయించి తద్వారా వచ్చే రాబడిని అటవీశాఖకు, సాగునీటి సంఘానికి, పంచాయతీకి వాటాగా చెల్లించేవారు. కానీ ఆత్మకూరు చెరువులో దాదాపు 4దశాబ్దాల క్రితం వేసిన తుమ్మ మొక్కలు పెరిగినా వాటిని పట్టించుకోనందున అన్యాక్రాంతం కావడం, ఎండిపోవడం, మట్టిగా మారుతుండడం జరుగుతోంది, ప్రాచీన చరిత్రకలిగి 1098 ఎకరాల ఆయకట్టు కలిగిన, ఆరుతాములు కలిగిన, క్రమీణా 5600ఎకరాల ఆయకట్టుగా మారిన ఆత్మకూరు చెరువులోతట్టు వందలాది ఎకరాల్లో తుమ్మ మొక్కలు నాటిన అధికారులు వాటిని గాలికొదిలేశారని లక్కు ప్రసాద్ పేర్కొన్నారు. సకాలంలో వాటని వేలం వేసి ఉంటే అదికమొత్తంలో రాబడి వచ్చి ఉండేదన్నారు. నువ్వురుపాడు వద్ద ఒక తూము ఉండగా సక్రమంగా సాగునీరందడం లేదన్నారు. కాగా చెరువులో తుమ్మచెట్లను వేలం వేసి ఉంటే వివిధ పనిముట్లు, పరికరాలు, ఫర్నిచర్‌కు జనాలు అధికంగా పాటలో పాల్గొని కొనుగోలు చేసేవారని, అధికమొత్తంలో ఆదాయం వచ్చి ఉండేదని ప్రసాద్ పేర్కొన్నారు. ఇప్పటికైనా వంటచెరుకుగానైనా వేలం వేస్తే కొంతమేరకైనా రాబడి లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈమేరకు ఆత్మకూరు అటవీశాఖాధికారికి వారు ఒక వినతపత్రం అందజేసి వివరాలు తెలిపారు. ఇరిగేషన్ అధికారులు కూడా ఈ చెట్ల విషయం గురించి పట్టించుకొనకపోవడం విచారకరమన్నారు. ప్రజల ఆస్తి మట్టిపాలవుతుంటే అధికారులు ఏమీ పట్టనట్లుగా వ్యవహరించడం అత్యంత శోచనీయమన్నారు. ఇప్పటికైనా స్పందించాలని లక్కు ప్రసాద్ తదితరులు డిమాండ్ చేశారు.

## ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్
# ఇంజనీర్స్ డైరీ 2025 ఆవిష్కరణ



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండల కేంద్రంలోని ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజనీర్స్ డైరీ తేది:02-01-2025 గురువారం మధ్యాహ్నం గం.12.00లకు సైదాపురం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని మీటింగ్ హాల్ నందు ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజనీర్స్ డైరీ-2025 ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. మండల స్థాయిలో చిన్నపాటి చిరు ఉద్యోగులు ఒక యూనిటీగా నిలబడి రాష్ట్రస్థాయి నుండి మండల స్థాయి వరకు ఒకటిగా ఉండి వారి సమస్యలను పరిష్కరించుకునే దిశలో భాగంగా ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజనీర్ 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంకు ముఖ్యఅతిధిగా పి.శివ కుమార్, సైదాపురం మండల ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్, ఏఓ ఎన్.మురళీకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పి.ముని మనోజ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏఎస్ఈ డైరీ ఆవిష్కరించారు.

# నీటి వెతలను తీర్చిన సర్పంచ్



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** అనంతసాగరం మండలం పడమటి కంభంపాడు లోని కాలువ వద్ద గల ముస్లిం కాలనీ వాసులకు నీటి కష్టాలు తీరాయి. మంచినీటి పంపిణీ వ్యవస్థ ఉన్నప్పటికీ కాలనీవాసులకు నీరు సరిపడా సరఫరా అయ్యేది కాదు. వారి కష్టాలను,అభ్యర్థనలను పరిశీలించిన సర్పంచ్ కత్తి లావణ్య శాశ్వత పరిష్కరణకు శ్రీకారం చుట్టారు. పంచాయతీ వార్డు మెంబర్లతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి సింటెక్స్ ట్యాంకు ఏర్పాటుకు తీర్మానించారు. 2000 లీటర్ల కెపాసిటీ కలిగిన ట్యాంకు ఏర్పాటు ద్వారా కాలనీవాసులకు ఇక నిత్యం తగినంత వాటర్ అందుబాటులోకి వచ్చింది. సమస్య పరిష్కారణ కోసం సత్వరమే స్పందించి నీటి కష్టాలు తీర్చిన సర్పంచ్ కత్తి లావణ్యకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి..
# శానిటేషన్ కార్యక్రమాలు పరిశీలన : కమిషనర్

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగరంలోని పలు ప్రాంతాల్లోని శానిటేషన్ కార్యక్రమాలు ఏ విధంగా జరుగుతున్నాయో అవి కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి గురువారం నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ పరిశీలించారు. అందులో భాగంగా 11వ డివిజన్ రాంజీ నగర్ ట్రాన్స్‌ఫారం పాయింట్ వద్ద వున్న చెత్తను తొలగించనందున సంబంధిత శానిటేషన్ కార్యదర్శికి షోకాజు నోటీసు ఇవ్వమని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరికైతే మూడు షోకాజు నోటీసుల జారీచేసిన పిదప సంబంధిత ఉద్యోగిని సస్పెండ్ చేస్తానని తెలియజేశారు. ప్రతిరోజు కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా శానిటేషన్ కార్యక్రమాలను పర్యవేక్షిస్తానన్నారు. ప్రతి పాయింట్లు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయమని ఇప్పటికే ఆదేశించియున్నామని తెలిపారు. అందరు శానిటరీ కార్యదర్శులు మీ యొక్క సచివాలయ పరిధిలోని శానిటేషన్ పర్యవేక్షణ క్రమం తప్పకుండా జరిగేలా చర్యలు తీసుకోమని హెచ్చరించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ సిబ్బంది ద్వారా పర్యవేక్షించిన పిదప చర్యలకు సంబంధిత అధికారుల కు తెలియచేసి సమస్యలను పూర్తి చేయాలని, ట్రాక్టర్, ఇతర వాహనాలు ద్వారా చెత్తను ఎప్పటిక ప్పుడు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



# మోడల్ పాఠశాల ఉపాధ్యాయుడుపై విచారణ



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన ఏఎస్పేటలోని మోడల్ పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడుపై ఏఎస్పేట మండల విద్యాశాఖ అధికారులు గురువారం విచారణ చేపట్టారు అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గత నెల 30వ తేదీన పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడు విద్యార్థినీ విద్యార్థులకు అసభ్య కథనాలు చెప్పినట్లు తెలిపారు. అయితే ఈ విషయాలను విద్యార్థులు వారి తల్లిదండ్రులకు తెలియజేశారు. దాంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇలాంటి కథనాలు చెప్పడం ఏంటని ప్రశ్నిస్తూ మండల విద్యాశాఖ అధికారులకు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండల కేంద్రమైన ఏఎస్పేటలోని మోడల్ పాఠశాలలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయుల నుంచి పలు విషయాలను సేకరించి జిల్లా అధికారులకు నివేదికను అందజేయనున్నట్లు ఎంఈఓలు తెలిపారు. అయితే గతంలో కూడా పాఠశాలలో అదే ఉపాధ్యాయుడు పై పలు ఆరోపణలు ఉన్నాయి. ఈ మేరకు గతంలో ఇప్పటివరకు మూడుసార్లు విచారణ కూడా అధికారులు నిర్వహించారు. డిప్యూటీ డీఈవోలు సైతం విచారణ నిర్వహించి నామమాత్రంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి మోడల్ పాఠశాల పై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ఉపాధ్యాయుడుపై చర్యలు చేపట్టాలని పాఠశాలలో పనిచేస్తున్న సిబ్బంది ఉపాధ్యాయులను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజలు గ్రామస్తులు కోరుతున్నారు. అయితే ఈ విషయంపై ఉపాధ్యాయుడు వివరణ ఇస్తూ తాను అసభ్యంగా కథనాలు చెప్పలేదని విద్యార్థులకు మోరల్ స్టోరీ చెప్పినట్లు తెలిపారు.

## పాఠశాలల అభివృద్ధికి ఎస్ఎంసీ పాత్ర కీలకం




**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పాఠశాల అభివృద్ధికి పాఠశాల యాజమాన్య కమిటీల పాత్ర కీలకమని ఉదయగిరి మండల విద్యాశాఖ అధికారి 2 తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం స్థానిక స్త్రీ శక్తీ భవనంలో మండల స్థాయి పాఠశాలల యాజమాన్య కమిటీ చైర్మన్/ సభ్యులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి పాఠశాలల యాజమాన్య కమిటీల పాత్ర కీలకమైనదని మరియు పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ లేదా సభ్యులు పాఠశాలలను తరచుగా సందర్శించి మధ్యాహ్న భోజనము, పాఠశాల శుభ్రత పరిశుభ్రత, త్రాగునీరు తదితర అంశాలను పరిశీలిస్తూ పాఠశాలల అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. పాఠశాల యాజమాన్య కమిటీల విధులు బాధ్యతలను ప్రధానోపాధ్యాయులకు పాఠశాల యాజమాన్య కమిటీలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్‌గా రామకృష్ణారెడ్డి, ఫణి కుమార్, సుబ్బారెడ్డిలు పాల్గొన్నారు.

## కమిటీ చైర్మన్‌లకు, ఉపాధ్యాయులకు శిక్షణ



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలోని జడ్పీ హెచ్‌ఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎంఈఓ బండి గోవిందయ్య, సిహెచ్ వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో ఓరియంటేషన్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కావలి పట్టణం, రూరల్ ప్రాంతం పరిధిలో సుమారు 120 పాఠశాలలకు సంబంధించిన 250 మంది విద్యా కమిటీ చైర్మన్‌లకు ఉపాధ్యాయులకు అభివృద్ధి, మౌలిక వస్తువులు మెరుగుపరచడంలో మనబడి మన భవిష్యత్తు, డ్రాప్‌ఔట్స్, మధ్యాహ్న భోజన పథకం, తదితరుల వాటిపై వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్పివోలుగా మధు, రమణయ్య, చెన్నయ్య, వ్యవహరించారు.

## కమిటీ చైర్మన్‌లకు ప్రధానోపాధ్యాయులకు శిక్షణ



**చేజర్ల, మేజర్‌న్యూస్ :** చేజర్ల మండలంలోని అన్ని పాఠశాలల ఎస్ఎంసీ చైర్మన్‌లకు ప్రధానోపాధ్యాయులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని గురువారం చేజర్ల జడ్.పి.ఉన్నత పాఠశాల నందు ఏర్పాటు నిర్వహించారు. ఈ మండల స్థాయి శిక్షణలో పాఠశాల యాజమాన్య కమిటీ విధులు, బాధ్యతలు, బాలల హక్కులు, పాఠశాలల అభివృద్ధి ప్రజల భాగస్వామ్యం మొదలైన అంశాలపై డిస్ట్రిక్ రీసోర్స్ పర్సన్స్ శిక్షణ ఇవ్వడం జరిగిందని, ఇక్కడ శిక్షణ తీసుకున్నవారు 4వ తేదీ పాఠశాల స్థాయిలో ఎస్ఎంసి సభ్యులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని మండల విద్యాశాఖాధికారి-2 డీసీ మస్థానయ్య తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హైమావతి, డిఆర్‌పిలు సుబ్రహ్మణ్యం, రమణయ్య, ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసి చైర్మన్లు పాల్గొన్నారు.

## మూలస్థానేశ్వర స్వామి హుండీ లెక్కింపు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మూలాపేటలోని శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో గురువారం హుండీ లెక్కింపు జరిగింది. శ్రీ స్వామి మరియు అమ్మవారుల హుండీలు లెక్కింపు 2వ తేదీ గురువారం ఉదయం గం 10.30 ని.లకు శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీ శ్రీధర్ నాయుడు, పూడిపర్తి వారి అద్వార్యంలో, సీనియర్ సిటిజన్స్,స్టేట్ బ్యాంక్ ఉద్యోగులు, దేవస్థాన సిబ్బంది, భక్తుల సమక్షంలో హుండీల లెక్కింపు జరిగినది అని ఆలయ కార్యనిర్వహణ అధికారి తెలిపారు. (13.09.2024 నుండి 2.01.2025) వరకు 3 నెలల 24 రోజులకు గాను హుండీల లెక్కింపు వలన వచ్చిన జమ రూ.10,17,259/- (పదిలక్షల పదిహేడువేల రెండు వందల యాభై తొమ్మిది రూపాయలు) మొత్తం పైకమును ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, మూలాపేట నందు జమ చేయబడినది అని అసిస్టెంట్ కమిషనరు మరియు కార్యనిర్వహణాధికారి జె.శ్రీనివాసరావు తెలిపారు.

## ఉపాధ్యాయ శిక్షణ తరగతులు



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా సైదాపురం మండల కేంద్రంలో సైదాపురం జడ్పీ హైస్కూల్ నందు మండల స్థాయి పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా తరగతుల్లో ఎస్ఎంసి చైర్మన్‌లకు, ప్రధానోపాధ్యాయులకు యాజమాన్య కమిటీ యొక్క విధులు వాళ్ళు చేయవలసిన పనులు వివరించారు. శిక్షణ తీసుకున్న వారు నాలుగో తేదీ పాఠశాల స్థాయిలో మిగిలిన సభ్యులకు అందరికీ శిక్షణ ఇస్తారు. గురువారం జరిగిన శిక్షణ తరగతుల్లో మండల అభివృద్ధి అధికారి పురుషోత్తం శివకుమార్ విచ్చేసి తమ అమూల్యమైన సందేశాన్ని ఇచ్చారు. ఆర్పీలుగా వీర రాఘవులు, ప్రసాద్, టి.రవి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి1, 2 ఏ.దయాకర్ రావు, వి.సుప్రియ జడ్పీ హైస్కూల్ చైర్మన్ మల్లారపు నీరజ ఇతరులు పాల్గొన్నారు.

## ఎస్ఐ, ఎంఈఓలకు సన్మానం



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట ఎస్ఐ ఏ.సైదులు, ఎంఈఓలు ఎం.జ్యోతి, డి.సాయిప్రసాద్‌లను ఠాగూర్ పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు ఎం.జ్యోతి, డి.సాయిప్రసాద్‌లకు శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. అలాగే ఎస్ఐ ఏ.సైదులకు శాలువా కప్పి పూలమాలవేసి సత్కరించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఠాగూర్ పాఠశాల కరస్పాండెంట్ సిహెచ్ వెంకటరమణారెడ్డి ప్రధానోపాధ్యాయులు కె.దొరస్వామి రెడ్డి పాల్గొన్నారు.

## పాఠశాలల యాజమాన్య కమిటీలకు శిక్షణ



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలంలోని అన్ని పాఠశాలల యాజమాన్య కమిటీలకు మర్రిపాడు మండల అభివృద్ధి అధికారి కార్యాలయం నందు మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని పాఠశాలల యాజమాన్య కమిటీ చైర్మన్‌లు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి-2 ధనలక్ష్మి మాట్లాడుతూ.. పాఠశాలల సమగ్ర అభివృద్ధి కోసం పాఠశాల యాజమాన్య కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందనీ, కమిటీ సభ్యులు సమర్థవంతంగా పనిచేసి పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు.

## సీజనల్ వ్యాధులపట్ల జాగ్రత్తలు పాటించాలి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం వెన్నవాడలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.ఐజాక్‌ప్రవీణ్ ఆధ్వర్యంలో గురువారం సీజనల్‌వ్యాధుల అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ జగన్నాథం లక్ష్మమ్మ, పంచాయతీ కార్యదర్శి, తదితరులు గ్రామంలో పర్యటించి ప్రజలకు సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. మలేరియా, డెంగ్యు, డయేరియా తదితర వ్యాధులు గురించి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వారు వివరించారు. వర్షాలు, మంచు ,చలిగాలులు కారణంగా ఏఏ సీజనల్‌వ్యాధులు సోకుతాయి, ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధులు సోకితే వైద్యసేవలు పొందడం తదితర అంవాల గురించి వారు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు పసుపులేటి శ్రీరామ్, తెలుగుదేశం నాయకుడు ఏలూరు కిరణ్, పంచాయతీ కార్యదర్శి భానుప్రకాష్, మహిళాపోలీస్ సునీత, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రుచిత, అంగన్‌వాడీ కార్యకర్త పెంచలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆపస్ క్యాలెండర్లను ఆవిష్కరించిన ఎంపీపీ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయసంఘం (ఆపస్) రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్లను, డైరీలను ఆత్మకూరు మండలాధ్యక్షుడు, జిల్లా మండలాధ్యక్షుల సంఘ అధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి గురువారం ఆవిష్కరించారు. ప్రజలకు, ఉపాధ్యాయులకు ఉపయోగకరంగా ఉండే వివరాలతో సర్వాంగ సుందరంగా ఆపస్ క్యాలెండర్‌ను ఆ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో రూపొందించారు. క్యాలెండర్లను ఆవిష్కరించిన మండలాధ్యక్షుడు యూనియన్ నాయకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆపస్ జిల్లా ప్రధానకార్యదర్శి పట్నం అనీల్‌కుమార్, ఆపస్ నాయకులు పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దేపూరులో రెవిన్యూసదస్సు, గ్రామసభ నిర్వహణ





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం దేపూరులో గురువారం రెవిన్యూసదస్సు, గ్రామ సభలను అధికారులు నిర్వహించారు. మండల తహశిల్దారు వి.సుధీర్‌బాబు, ఎంపీడీఓ పి.ఐజాక్ ప్రవీణ్‌లు పాల్గొన్నారు. ప్రజలనుండి అర్జీలు స్వీక రించి సమస్యల గురించి తెలుసుకున్నారు. సమ స్యల పరిష్కారం కోసం తగు చర్యలు తీసుకుం టామని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధికారులు ప్రసంగిస్తూ రెవిన్యూ సమస్యల పరిష్కారం లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేకంగా రెవిన్యూసదస్సులు నిర్వహిస్తుందన్నారు. ప్రజల నుండి అందే అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని, చట్టబద్ధత ఉంటుందని, పరిశీలనా నంతరం పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచ్ రావిళ్ల వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఏర్పాటు చేసిన గ్రామసభలో పంచాయతీ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. భవిష్యత్ కార్యాచరణ రూపొందించారు. ఈ సందర్భంగా జనవరి31వతేదీన పెన్షన్లు అందుకోలేని వారికి తహశిల్దారు సుధీర్‌బాబు, ఎండివో ఐజాక్‌ప్రవీణ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ, విఆర్వో, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## పడుగుపాడు అభివృద్ధిలో భాగస్వామ్యం కండి : జడ్పీటీసీ



**కోవూరు, మేజర్‌న్యూస్ :** కోవూరు మండలం పడుగుపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జడ్పీటీసీ సభ్యురాలు కవగిరి శ్రీలత పాల్గొన్నారు. అనంతరం గ్రామ సభలో గ్రామ అభివృద్ధి పై పలు అంశాలు అధికారులు, స్థానిక సంస్థ ప్రజా ప్రతినిధులు చర్చించుకోవడం జరిగింది. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పంచాయతీ పాలకవర్గం ఎంపీటీసీ సభ్యులు అధికారులు ఎప్పటికప్పుడు గ్రామ సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తూ పంచాయతీ అభివృద్ధికి తోడ్పడాలని, ప్రజాసేవే పరమావధిగా ప్రజలకు సేవ చేసి పంచాయితీకి మంచి పేరు తీసుకుని రావాలని కోరారు. ఈ సమావేశంలో సర్పంచ్ చౌటూరు లక్ష్మీనారాయణ, డిఎల్‌పిఓ రమణయ్య, ఈవోపీఆర్డి శ్రీనివాసులు, ఈఓ హజరత్ బాబు, ఎంపీటీసీ సభ్యులు షేక్ పర్వీన్, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రుచికరమైన ఆహారం అందించండి : ఎంఈఓ



**సీతారాంపురం, మేజర్‌న్యూస్ :** డొక్కా సీతమ్మ గోరుముద్దులో భాగంగా విద్యార్థులకు ఆహారాన్ని అందించే మధ్యాహ్నభోజన పథకం నిర్వాహకులు విద్యార్థుల కు రుచికరమైన ఆహారం అందించాలని మండల ఎంఈఓ ఎస్కే మస్తాన్‌వలి తెలిపారు. గురు వారం ఓవరు వాండ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనాన్ని విద్యార్థులకు అందించాలని తెలిపారు. భోజనానికి ముందు విద్యార్థులు ఆహారం తీసుకునే ప్రాంతాన్ని శుభ్ర పరచాలని, ఉపాధ్యాయులు విద్యార్థుల చేత హ్యాండ్ వాష్ చేయించిన తర్వాతనే భోజనం అందించాలని తెలిపారు. ప్రతిరోజు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మరొక ఉపాధ్యాయుడు భోజనం తయారు చేసే విధానాన్ని పరిశీలించాలని, భోజనం తయారీలో వాడుతున్న పదార్థాలను, కూరగాయల నాణ్యతను, కొలతలను, పరిశీలించాలని తెలిపారు. ప్రతిరోజు భోజనం ముగిసిన తర్వాత ఒక విద్యార్థి చేత ఆహారంలోని లోపాలను టెస్టింగ్ ద్వారా గుర్తించాలని తెలిపారు. ప్రతిరోజు ఒక ఉపాధ్యాయుడు వండిన ఆహారాన్ని రుచి చూసిన తర్వాతే విద్యార్థులకు అందించాలని తెలిపారు. పరిశుభ్రమైన మంచినీరు ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సిగే కొండయ్య, సిఆర్పి వెంకటేశ్వర్లు, భాస్కర్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పంటపాలెంలో రోడ్డు ప్రమాదం



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** కృష్ణపట్నం పోర్టు బైపాస్ రోడ్డు మార్గంలో పంటపాలెం సమీపాన గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒరిస్సా రాష్ట్రానికి చెందిన కార్మికుడు మృతిచెందారు. ఈ నేపథ్యంలో టిప్పర్ ఢీకొని రూపు మాజీ( 22) అనే కార్మికుడు దుర్మరణం చెందిన సంఘటన జరిగింది. సంఘటన స్థలం కు పోలీసులు వెళ్లి వివరాలు నమోదు చేశారు. మృతుడు ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. కేసు నమోదు చేసి దాదాపు చేసినట్లు ఎస్సై విశ్వనాథరెడ్డి తెలిపారు

# నూతన సంవత్సరంలో అర్హులందరికీ న్యాయం చేయాలి

**● నూతన సంవత్సరంలో అర్హులందరికీ న్యాయం చేయాలి ● కొండంత ఆశలతో ఎదురుచూస్తున్న జనాలు**

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** వివిధ సమస్యలు, సంక్షేమకార్యక్రమాల్లో అర్హులందరికీ న్యాయం చేయాలని వివిధ వర్గాల ప్రజలు కోరుతున్నారు. గత ప్రభుత్వ నిర్ణయాలు అమలు చేస్తే ఇబ్బందికరమని కొందరు, కొన్ని నిర్ణయాలు అమలుచేయకుంటే ఇబ్బందికరమని మరికొందరు అభిప్రాయపడ్డారు. 20సంవత్సరాలకు క్రితం ప్రభుత్వం డిఫారం పట్టాగా రైతులకు ఇచ్చిఉంటే అలాంటివారికి ఫ్రీహోల్డ్ అంటూ వైసిపి ప్రభుత్వం పలువురు రైతులకు ఫ్రీహోల్డ్ అంటూ సర్టిఫికేట్లు పంపిణీ చేశారు. ఈ సర్టిఫికేట్ ద్వారా ఆ భూములను విక్రయించుకోవచ్చని, రిజిస్టర్ చేసుకోవచ్చని నిర్ణయించారు. దాదాపు ఏడాదిక్రితం ఈ పర్టిఫికేట్లు ఇవ్వడంతోపాటు ఆన్‌లైన్‌లో ఆయా పొలాలకు సంబంధించి గత ఏడాది ఫ్రీహోల్డ్ చేయబడిందని నమోదు చేశారు. కానీ తీరా చూస్తే ఈ నూతన ప్రభుత్వం ఫ్రోహోల్డ్ అంశాన్ని పెండింగ్‌లో ఉంచింది. దాంతో ఆ సర్టిఫికేట్లు పొందిన రైతులు తీవ్ర నిరాశకుగురై ఆవేదన చెందుతున్నారు. తమకు 20సంవత్సరాలకు ముందు ఇచ్చిన డిఫారం పట్టాలు శాశ్వతపట్టాలుగా మారనున్నాయని సంబరపడ్డ రైతులు దిగాలు చెందిన ఉన్నారు. ప్రభుత్వం ఈవిషయమై పరిశీలించిన కొత్తగా ఇవ్వకున్నా ఇప్పటివరకు ఇచ్చిన ఫ్రీహోల్డ్ అంటూ సర్టిఫికేట్లు ఇచ్చివారికి చెల్లుబాటు అయ్యేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకొని న్యాయం చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

### ఫించన్లకు గత ప్రభుత్వ నియమాలు పాటించవద్దు

వివిధ రకాల పెన్షన్ల కొనసాగింపు, మంజూరుకు గత వైసిపి ప్రభుత్వ నియమాలు అమలు చేయవద్దని, చాలామంది తీవ్రంగా నష్టపోతారని అనేకమంది పెన్షనర్లు, పెన్షన్‌కు అర్హులైనవారు కోరుతున్నారు. గత ప్రభుత్వం దారిద్ర్యరేఖకు దిగువనున్న రైస్‌కార్డు దారులందరూ అర్హులు కాగా విద్యుత్ వినియోగం నెలకు 300యూనిట్లుకన్నా అధికంగా ఉందని, ఇంటికొలతలు అధికంగా ఉన్నాయని, నాలుగుచక్రాల వాహనాలున్నాయని, కుటుంబసభ్యులు ఆదాయపన్నులు చెల్లిస్తున్నారంటూ అనేకమందిని అనర్హులుగా చేసి పెన్షన్‌లు రద్దుచేశారు. అర్హులు నూతనంగా దరఖాస్తులు చేసుకునే అవకాశం లేకుండా చేశారు. దాంతో అందరూ లబోదిబో అంటూ తీవ్ర ఆవేదనకు గురికాగా పెన్షన్లను రద్దుచేసి పలువురికి వైసిపి ప్రభుత్వం అన్యాయం చేస్తుందంటూ తెలుగుదేశం నాయకులు గగ్గోలు పెట్టారు. కాగా రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన తెలుగుదేశం ప్రభుత్వం అదే నియమాలను అమలు చేయనుందని, అనర్హులంటూ పలువరి పెన్షన్లకు ముప్పు రానుందని, కొత్తగా పెన్షన్ల మంజూరుకు గత నిర్ణయాలు, నియమాలు పాటించనున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. గత నిర్ణయాలు అమలు ఉంటుందా లేదా, తాజా నిర్ణయాలా అనేది ప్రభుత్వం నుండి సచివాలయాకు ఇంకా ఎలాంటి ఆదేశాలు అందలేదంటున్నారు. ఏదేమైనా అర్హులకు నియమావళి అంటూ రైస్‌కార్డుదారులకు నూతన పెన్షన్లు మంజూరు కాకున్నా, ప్రస్తుతం ఉన్న పెన్షన్లు రద్దయినా అనేకమంది నష్టపోయేపరిస్థితి, ఆందోళనకుగురయ్యే పరిస్థితి, అలజడి చెలరేగే పరిస్థితి ఉంటుందని, ప్రభుత్వం పునరాలాలోచించి గతంలో తెలుగుదేశం అమలుచేసిన నియమావళినే ప్రాతిపదికన తీసుకోవాలని, వైసిపి నియమాలు అమలుచేయరాదని, సాధారణ,మధ్య తరగతి కుటుంబాలవారు కూడా విద్యుత్ 300యూనిట్లకన్నా అధికారంగా వినియోగించుకునే పరిస్థితి ఉంటుందని, బిడ్డలు చదువుకుంటూ కనీస అవసరాలను వాడుకూటుంటారని, అలాంటివారిని గమనించాలని, ఆంక్షలపేరుతో పెన్షన్లు రద్దుచేయారాదని అనేకమంది కోరుతున్నారు.

### టిడ్కోగృహాలు మంజూరైనవారికి పట్టాలివ్వాలి

గతంలో తెలుగుదేశం ప్రభుత్వహయాంలో నిర్మించిన టిడ్కోగృహాల నిర్మాణాలను పూర్తిచేసి లాటరీ విధానంలో లబ్ధిదారులకు కేటాయించారు. గత వైసిపి ప్రభుత్వం వాటిని గురించి పట్టించుకొనకుండా ఎన్నికలు సమీపించే పరిస్థితిలో మళ్ళీ గృహాలను కేటాయించారు. అయితే ఆత్మకూరులో చూస్తుంటే 1050 గృహాలు కాగా ఇప్పటివరకు ఐదారువందలమంది అక్కడకు నివాసాలు మార్చుకున్నారు. గతంలో చెప్పిన విధంగా అక్కడ గుడి,చర్చి,మశీదు, పార్కు, స్కూలు, అంగన్‌వాడీ కేంద్రం తదితరాలను ఏర్పాటు చేస్తామని తెలుగుదేశం ప్రభుత్వం ప్రకటించారు. పార్కుకు సంబంధించి మెటీరియల్ కూడా అక్కడకు చేర్చారు. అనంతరం వచ్చిన వైసిపి ప్రభుత్వం వాటి గురించి ఆలోచించిన పాపానపోలేదు. కాగా కొన్ని గృహాలు ఖాళీలుండగా అర్హులు కొందరు దరఖాస్తు చేసుకున్నారు. విఆర్వో, కమీషనర్,ఆర్డీవోల అర్హులుగా ఆమోదించి ఫైనల్‌గా జాయింట్ కలెక్టర్‌కు ప్రాతిపాదించగా అక్కడ కూడా ఆమోదం పొంది గృహాలు మంజూరయ్యాయి. అయితే వారికి పట్టాలిచ్చే సమయానికి రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. పట్టాపుస్తకాలపై గత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఫోటోలున్నాయని అధికారులు నిలిపివేశారు. ఈ ప్రభుత్వం ఆపాస్‌బుక్‌లను మార్చి లబ్దిదారులకు పట్టాలివ్వాలని కోరుతున్నారు. ఈవిషయమై ప్రభుత్వం సత్వర నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

### ఉచిత వంటగ్యాస్ రైస్‌కార్డుదారులందరికీ ఇవ్వాలి

ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఏడాదికి 3గ్యాస్‌సిలిండర్ల కార్యక్రమం ఈనెలాఖరుకు ప్రారంభం కానుండగా అర్హులందరికీ ఇవ్వాలని పలువురు కోరుతున్నారు. గ్యాస్ సబ్సిడిలో కూడా విద్యుత్, ఇంటికొలతలు తదితర ఆంక్షలు లేకుండా ఇవ్వాలని సర్వత్రా కోరుతున్నారు. మహిళలందరికీ 3సిలిండర్ల ఉచితం అన్నారని, రైస్‌కార్డులతో పనిలేకుండా ఇస్తారనుకున్నామని, ప్రభుత్వం రైస్‌కార్డుదారులకే అంటుందని, ఆప్రకారమైనా ఇతరత్రా ఆంక్షలు లేకుండా రైస్‌కార్డులున్న వారందరినీ అర్హులుగా పరిగణించి ఉచిత గ్యాస్‌సిలిండర్లు ఇవ్వాలని పలువురు మహిళలు కోరుతున్నారు.

# ఆర్థిక మోసగాళ్ళ మాయలను అరికట్టాలి

- పొదలకూరు వెలుగు ఏపీఎం చిన్నయ్య..
- ఆర్థిక విషయాల్లో ఎంతో అప్రమత్తత అవసరం
- టీడీపీ సీనియర్ నాయకులు కలిచేటి ప్రభాకర్ రెడ్డి




**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** కొత్త పంథాలో ఆర్థిక మోసగాళ్లు మాయ చేస్తున్నారని, ఆర్థిక విషయాల్లో అందరూ అప్రమత్తంగా వుండాలని పొదలకూరు వెలుగు ఏ.పి.ఎం చిన్నయ్య, టీడీపీ సీనియర్ నాయకులు కలిచేటి ప్రభాకర్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మరుపూరు గ్రామంలో పొదలకూరు ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, పొదుపు, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ వారు మాట్లాడుతూ.. అప్పుల విషయంలో జాగ్రత్తగా వుండాలని, గుర్తింపు పొందిన సంస్థలలో మాత్రమే అప్పులు తీసుకోవాలని సూచించారు. గతంలో లోన్ యాప్ ల బారిన పడి అధిక వడ్డీలు కట్టలేక, బ్లాక్ మెయిలింగ్ తట్టుకోలేక అనేకమంది ఆత్మహత్యలకు పాల్పడిన సంగతి గుర్తుచేశారు. ఆర్బీఐ వారి సౌజన్యంతో పొదలకూరుకి చెందిన ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ వారు బ్యాంక్ సేవలు, ఆర్థిక మోసాలపై అవగాహన కల్పిస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా పలు రకాల బ్యాంకు పథకాలు, సేవల పై సంపూర్ణ అవగాహన కల్పిస్తూ ప్రదర్శించిన పోస్టర్లు చూపరులను ఆకొట్టుకున్నాయి. పొదుపు అవసరం, సైబర్ నేరాలపై బ్యాంక్ ప్రతినిధులమంటూ అపరిచితుల నుంచి వచ్చే మేసేజ్‌లు, ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దన్నారు. ఫోన్‌కు వచ్చే ఓటీపీ, డెబిట్ కార్డుల పిన్, సీవీవీ వంటి నంబర్లు ఇతరులకు చెప్పవద్దన్నారు. అలాంటి గోప్యతా వివరాలను బ్యాంకులు అడగవని గుర్తించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖాతాదారులకు అందిస్తున్న ప్రత్యేక పథకాలు, సేవలను ఖాతాదారులకు వివరించారు. వ్యక్తిగత ఆర్థిక ప్రణాళికలను ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. నగదు రహిత లావాదేవీలు నిర్వహించడానికి ప్రాముఖ్యత ఇవ్వాలని సూచించారు. ఫిర్యాదుల వ్యవస్థను ఉపయోగించుకొని సత్వర సక్రమ ఆర్థిక సేవలను పొందాలన్నారు. బ్యాంకింగ్ అంబుడ్స్ మెన్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రీస్ గౌరవ అధ్యక్షులు షేక్.నౌరాజ్, కార్యదర్శి షేక్.అహ్మద్, రిసోర్స్ పర్సన్ ఏ.చంద్రశేఖర్, వీఓఏ లక్ష్మీ, బ్యాంకు ఖాతాదారులు, స్థానికులు పాల్గొన్నారు.


సూర్య

## విలేకర్లు కావలెను

తెలుగు పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దినపత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

నెల్లూరు జిల్లాలోని బుచ్చిరెడ్డిపాలెం, సంగం, కొడవలూరు, వెంకటాచలం,మనుబోలు, అల్లూరు, దగదర్తి, విడవలూరు దుత్తలూరు. నెల్లూరు పట్టణంలో దర్గామిట్ట, స్టోన్‌హౌస్‌పేట, వేదాయపాలెం, బాలాజీ నగర్‌లలో విలేకర్లు కావలెను.

మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

నేటి దినపత్రిక సూర్య కార్యాలయం
మిలటరీ కాలనీ, రోడ్ నెం.1,ఎల్ఐసి & సిడిఓ ఆఫీసు ఎదురుగా, కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు
9000118811, 9963827227


# రాష్ట్ర చేనేత కార్మిక సంఘం 2025 క్యాలెండర్ ఆవిష్కరణ




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం (ఏఐటీయుసీ), ఆధ్వర్యంలో 2025 నూతన సంవత్సరం క్యాలెండర్ నెల్లూరు రూరల్ మండలం సౌత్ మోపూర్ గ్రామంలో ఆవిష్కరించారు. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్ర ప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు, కామ్రేడ్ పముజల దశరథ రామయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. ముందుగా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం, చేనేత కార్మికుల హక్కుల సాధనకై ఎంతో శ్రమించి వారి హక్కులను కాపాడుకుంటూ ముందుకు సాగుతుందన్నారు. అదే తరుణంలో రానున్న రోజుల్లో కూడా ఇదే తరహాలో పనిచేస్తుందన్నారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ పముజల హరి మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికుల పట్టించుకోవడంలేదని వారికి సరైన జీవన ఉపాధి లేక వలస వెళ్లి కూలి పనులు చేసుకుని బ్రతికే స్థితికి దిగజార్చారని ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి చేనేత కార్మికునికి అండగా ఉండి ప్రభుత్వం వైపు నుండి ప్రోత్సహించాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమా నిర్వహించి ప్రభుత్వ మెడలు వంచైనా సరే వారి చేత పని చేయిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పముజల వనజాక్షమ్మ, గౌరవ అధ్యక్షులు చల్లా నరసయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి చైతన్య, మరియు కార్యవర్గ సభ్యులు, నారాయణ, రాజశేఖర్, లక్ష్మీనరసయ్య, అప్పారావు ,పులి జనార్ధన్, మన్నెం రాంబాబు, జక్కల వెంకటసుబ్బయ్య, జానా మస్తానయ్య, తుళ్లూరు ఆదిశేషయ్య, కందే శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కనుల పండుగగా రంగనాథనోత్సవం



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరులోని శ్రీ తల్పగిరి రంగ నాథ స్వామి వారి దేవ స్థానం, రంగనాయకులపేట నందు గురు వారం పగల్ పత్తు ఉత్సవాలలో భాగంగా సాయంత్రం 6.30 గంటలకు 3వ ఉత్సవం అయిన కోదండరామ అవతారంలో శ్రీ శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీ రంగనాథ స్వామి వారు కనివిందు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంకు ఉభయదాత 'శ్రీ అనుమాలశెట్టి నారాయణరావు' వ్యవహ రించినారు. ఈ కార్యక్రమంకు జిల్లా దేవాదాయ అధికారి, కె.జనార్ధన రెడ్డి, ఆలయ ఈఓ ఆళ్ళ శ్రీనివాస రెడ్డి, దేవస్థాన చైర్మెన్ మంచికంటి శ్రీనివాసులు ధర్మకర్తల మండలి సభ్యులు వేలూరు శ్రీనివాసులు, బల్లవోలు రమణయ్య, వీరెపల్లి పద్మజ, దేవస్థాన సిబ్బంది వారు కార్యక్రమం నందు పాల్గొనడం జరిగిందని ఆలయ అధికారులు తెలిపారు.

### టిడ్కో గృహ సముదాయలకు..

# మౌళిక వసతులను మెరుగుపరచండి : కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలోని టిడ్కో గృహ సము దాయాల ప్రాంగణాలలో మౌళిక వసతులను మెరుగుపరిచి, లబ్ధిదారులకు గృహాలను అందు బాటులోకి తీసుకురావాలని కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. స్థానిక అల్లీపురం లోని గృహ సముదాయాల ప్రాంగణాన్ని కమిష నర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. గృహాలలో నివాసం ఉంటున్న ప్రజలకు మంచినీటి సమస్య ప్రాధాన్య తను గుర్తించి అవసరం మేరకు నీటి సరఫరా పెంచాలని అధికారులను కమిషనర్ ఆదేశిం చారు. గృహ సముదాయాల ప్రాంగణంలో హై మాక్స్ విద్యుత్ దీపాలతో పరిసరాలన్నీ రాత్రి పూట స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలని, ప్రాంగణం మొత్తం రికార్డు అయ్యేలా సీసీ కెమె రాలను ఏర్పాటు చేయాలనీ అధికారులను కమిష నర్ ఆదేశించారు. అదేవిధంగా సెక్యూరిటీ సిబ్బంది గస్తీని ముమ్మరం చేసి ప్రాంగణంలో ఎలాంటి దొంగతనాలు జరగకుండా నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని ఆయన తెలియజేశారు. నిర్మాణాలు పూర్తయిన గృహాలలో లబ్ధిదారులందరూ చేరేలా చర్యలు తీసుకోవాలని, గృహ సముదాయాల్లో నూతనంగా చేరిన పెన్షన్ అందుకుంటున్న లబ్ధిదారులను స్థానిక సచి వాలయానికి అనుసంధానం చేయాలని సూచిం చారు. ప్రాంగణంలో పారిశుధ్య నిర్వహణ పను లను క్రమం తప్పకుండా చేపట్టేలా పర్యవేక్షిం చాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమం లో నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య, హౌసింగ్ కార్పొరేషన్ ఈఈ, డీఈఈ, ఏఈలు, నగరపాలక సంస్థ ఇంజ నీరింగ్ ఈఈ శ్రీనివాసులు, టౌన్ ప్లానింగ్ అధి కారులు, వార్డు సచివాలయ అమెనిటీస్, వార్డ్ ప్లానింగ్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఆటో యజమానులు, డ్రైవర్ల సమస్యలను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసు కెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ రియాజ్ పేర్కొన్నారు. గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పలువురు ఆటో యజమానులు, డ్రైవర్లు ఆయన్ను కలిసి సమస్యలు విన్నవించారు. తమ కు బస్టాండ్ సెంటర్లో స్టాండ్ లేక ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం రుణాలు మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపుతానన్నారు. అనంతరం బస్టాండ్ సెంటర్లో నూతన ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సందానీ, అలీజాన్, హోటల్ సందానీ, ఖాలీద్, ఏఐటీయూసీ ఫక్రుద్దీన్, ఖాజావలి, జమీర్, ఏసు, ఖాజారసూల్ తదితరులు పాల్గొన్నారు.